నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం

చింతల్‌: చింతల్‌ డివిజన్‌ హెచ్‌ఎంటీ కాలనీలోని వేంకటేశ్వర స్వామి 49వ కల్యాణ మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎంటీ హిందూ దేవాలయ అసోసియేషన్‌ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9:38 నిమిషాలకు కల్యాణం జరుగనుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మహిళా దినోత్సవం సందర్భంగా పోటీలు

నిజాంపేట్‌ : ఏడబ్ల్యూడబ్ల్యూ 10వ వార్షికోత్సవం వేడుకల్లో భాగంగా మహిళా దినోత్సవాన్ని కూడా ఘనంగా నిర్వహించనున్నట్లు ఏడబ్ల్యూడబ్ల్యూ ఫౌండర్‌, ప్రెసిడెంట్‌ చలసాని భారతి బుధవారం తెలిపారు. నిజాంపేట్‌, సప్తపది గార్డెన్స్‌లో 7న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలందరూ పాల్గొనాలని, ఎలాంటి రుసుపు లేదన్నారు. ఫన్‌, ఫుడ్‌, గేమ్స్‌, కాంటెస్ట్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజాంపేట్‌లో పాల్గొన్న వారిలో విన్నర్‌కు రూ.25 వేలు, మొదటి రన్నరప్‌కు రూ.10 వేలు, రెండవ రన్నరప్‌కు రూ.5 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం క్యాన్సర్‌ స్క్రీనింగ్‌, హెల్త్‌ చెకప్స్‌ ఉంటాయని తెలిపారు.

టెండర్లకు ఆహ్వానం

కుత్బుల్లాపూర్‌ : నాలుగు డివిజన్‌లలో సిమెంట్‌ రోడ్డు అభివృద్ధి పనుల కోసం అధికారులు టెండర్లకు ఆహ్వానించారు. మొత్తం కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలో ఉన్న నాలుగు డివిజన్లకు రూ.3.52 కోట్ల నిధులతో ఈ పనులు చేపట్టనున్నారు. రంగారెడ్డి నగర్‌ డివిజన్‌ 127లో గాంధీనగర్‌లో రూ.28.50 లక్షలు, వెంకట్రామిరెడ్డి నగర్‌లో రూ.10. 80, రంగారెడ్డి నగర్‌ చర్చి లైన్‌ రూ. 21 లక్షలు, సుభాష్‌ నగర్‌ డివిజన్‌ 130లో నరసింహ బస్తీ రూ.46 లక్షలు, భవాని నగర్‌– సుందర్‌ నగర్‌లో రూ.40 లక్షలు, రాజిరెడ్డి నగర్‌ రూ.22 లక్షలు, కుత్బుల్లాపూర్‌ డివిజన్‌ 131 లో వాజ్పేయి నగర్‌లో రూ.25.30 లక్షలు, రామకృష్ణ నగర్‌లో రూ.16.10 లక్షలు, పద్మా నగర్‌ ఫేజ్‌– 1 లో రూ.24.50 లక్షలు, జీడిమెట్ల డివిజన్‌ 132లో అంగడిపేట్‌లో రూ. 25 లక్షలు, అయోధ్య నగర్‌లో రూ.20 లక్షలు, గాయత్రి నగర్‌లో రూ. 38.50 లక్షలు, గాయత్రి నగర్‌ ఫేజ్‌ 2 లో రూ.35 లక్షల విలువచేసే సిమెంట్‌ రోడ్డు పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు చేపడతామని సర్కిల్‌ ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ లక్ష్మీ గణేష్‌ పేర్కొన్నారు.

మున్సిపల్‌ కమిషనర్‌కు వినతి

నిజాంపేట్‌: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు




కమిషనర్‌ సాబేర్‌ అలీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

లేబర్‌ చట్టాలను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.చంద్రశేఖర్‌ డిమాండ్‌ చేశారు. తెలంగాణ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయిస్‌ యూనియన్‌ ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని నిజాంపేట్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి మున్సిపల్‌ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమ్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. 7వ తేదీ చలో హైదరాబాద్‌ కార్మిక కమిషనర్‌ ఆఫీస్‌ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెంటయ్య, నాగేషు, సత్యనారాయణ, జైపాల్‌, చెన్నయ్య, మనీ వెంకటమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్‌ కార్యాలయం ఎదుట ధర్నా

నిజాంపేట్‌ : పేదల నిర్మాణాలనే హైడ్రా, మున్సి



పల్‌ అధికారులు కూల్చివేస్తున్నారని, ధనవంతుల జోలికి వెళ్లడం లేదని ఇందిరమ్మ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్‌ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. పేదల గుడిసెలు మాత్రమే తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు న్యాయం చేయాలని అధికారులను కోరారు.



జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్‌ గడ్డం మల్లేష్‌కు జాతీయ స్థాయిలో జ్యూరీ అవార్డు రావడం పట్ల పీఎస్‌ స్టాఫ్‌ ఆయనకు అభినందనలు తెలియజేశారు. –జీడిమెట్ల

రోడ్డు ఏర్పాటు విషయంలో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదు అన్న చందంగా మారింది హెచ్‌ఎండీఏ అధికారుల పరిస్థితి. రోడ్డు నిర్మాణం కోసం ప్రైవేట్‌ సంస్థ ముందుకు రాగా మాస్టర్‌ ప్లాన్‌లో రోడ్డు లేదు అని మెలిక పెట్టి పనులు నిలుపుదల చేయడంతో పలు కాలనీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డు వేయాల్సిన ప్రాంతం

అధికారులూ.. ఇదీ రోడ్డేనా?

- ఇబ్బంది పడుతున్న కాలనీల ప్రజలు
- మాస్టర్‌ ప్లాన్‌లో రోడ్డు లేదని హెచ్‌ఎండీఏ మెలిక !

కుత్బుల్లాపూర్‌ : కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ పరిధిలోని అపర్ణ సంస్థ పేట్‌ బషీరాబాద్‌ ప్రాంతంలో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన రోడ్డు పూర్తి చేసుకోగా.. మరో రోడ్డు కోసం రిలయన్స్‌ పెట్రోల్‌ పంపు నుంచి సబ్‌ స్టేషన్‌ వరకు కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్సిబిలిటీ కింద 500 మీటర్ల వరకు రోడ్డు వేసేందుకు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా 2024 అక్టోబర్‌ 16వ తేదీన కుత్బుల్లాపూర్‌ ఉప కమిషనర్‌కు, అదే విధంగా డిసెంబర్‌ 28న మేడ్చల్‌ జిల్లా కలెక్టర్‌లకు సీఎస్‌ఆర్‌ నిధులతో పనులు చేపడతామని లిఖితపూర్వకంగా అపర్ణ కన్‌స్ట్రక్షన్‌ ప్రతినిధులు లేఖలు రాశారు. దీనికి హెచ్‌ఎండీఏ అధికారులు అనుమతి ఇవ్వకపోడంతో అటువైపుగా 30 సంవత్సరాలుగా రాకపోకలు సాగిస్తున్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. యాదిరెడ్డి బండ, రంగారెడ్డి బండ, వైష్ణవి ఎన్‌క్లేవ్‌ కాలనీ, వుడ్స్‌ కాలనీ, సల్మాన్‌ బిల్‌ మోర్‌, సౌజన్య ఎన్‌క్లేవ్‌ ప్రాంతవాసులతో పాటు అల్వాల్‌ సర్కిల్‌కు వెళ్లే ప్రజలు సైతం ఇబ్బందులు తప్పడం లేదు. నగరం, నగర శివారు ప్రాంతాల్లో ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలు ఉండగా అక్కడ మాస్టర్‌ ప్లాన్‌ నిబంధనలు ఏమీ లేకున్నా.. రోడ్లు ఇతరత్రా సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ మాత్రం నిబంధనల పేరుతో హెచ్‌ఎండీఏ అధికారులు పనులు చేయకుండా అడ్డుకోవడం పై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే అధికారులు రోడ్డు ఏర్పాటు చేసే విధంగా సహకరించాలని కోరుతున్నారు.

పట్టించుకోని అధికారులు

నడవడానికి ఇబ్బందిగా ఉన్న ఈ రోడ్డుపై సిమెంట్‌ రోడ్డు లేదా బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని వుడ్స్‌ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రెండు సంవత్సరాలుగా కుత్బుల్లాపూర్‌ సర్కిల్‌ అధికారుల చుట్టూ తిరిగుతున్నారు. సమస్య తీవ్రంగా ఉందని వినతి పత్రాలు కూడా అందజేశారు. అయినప్పటికీ ఏ ఒక్క అధికారి స్పందించలేదు. గతంలో రూ.32 లక్షలతో బీటీ రోడ్డు పనులు చేసేందుకు నిధులు మంజూరయ్యాయని చెప్పుకొచ్చిన ఇంజినీరింగ్‌ అధికారులు నిధులు లేక పనులు చేయలేదని చేతులెత్తేయడం విడ్డూరంగా ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా రాయి చాందిని వెంచర్‌ నుంచి వుడ్స్‌ కాలనీ మీదుగా సల్మాన్‌ బెర్మోస్‌ సిమెంట్‌ రోడ్డు వరకు సుమారు రూ.42 లక్షలతో సిమెంట్‌ రోడ్డు ప్రతిపాదనలు చేసినప్పటికీ తాజాగా కేటాయించిన నిధుల్లో ఒక్క పైసా కేటాయించకపోవడం పై సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షపతి ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో ఏ ఒక్క రోడ్డుకు ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదని.. వందశాతం పన్ను చెల్లిస్తున్న తమ కాలనీవాసులకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు.




అవసరాలకు అనుగుణంగా చదును చేస్తాం

పేట్‌ బషీరాబాద్‌ సర్వే నంబర్‌ 25/1 సర్వే నంబర్‌ మీదుగా వేసే రోడ్డు విషయం కోర్టు పరిధిలో ఉంది. ఇప్పటికే ఈ రోడ్డు ప్రతిపాదనపై జిల్లా కలెక్టర్‌ తనతో మాట్లాడారు. ఇక్కడ వాహనదారులకు ఇబ్బంది లేకుండా ఇంజినీరింగ్‌ అధికారులతో రోడ్డును అనువుగా చేసేందుకు పనులు ప్రారంభిస్తే హెచ్‌ఎండీఏ అధికారులు అడ్డుకున్నారు. సుప్రీం కోర్టులో కేసు ఉండడం మూలంగా ఇబ్బందులు వస్తున్నాయి. ప్రజల అవసరాలకు అనుగుణంగా రోడ్డును చదును చేస్తాం.

– నరసింహ, ఉప కమిషనర్‌ కుత్బుల్లాపూర్‌

రోడ్డుపై మురుగు.. జనం బేజారు!

- నిత్యం పొంగిపొర్లుతున్న డ్రైనేజీ
- పట్టించుకోని అధికారులు
- శాశ్వత పరిష్కారం చూపాలంటున్న కాలనీవాసులు



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

జీడిమెట్ల: భూగర్భ డ్రైనేజీ ప్రతినిత్యం పొంగిపొర్లడంతో రోడ్లపై నడవాలంటే కష్టంగా ఉంది. సుభాష్‌నగర్‌ డివిజన్‌లోని వెంకటాద్రినగర్‌లో భూగర్భ డ్రైనేజీ అవుట్‌లెట్‌ మూసుకుపోవడంతో ప్రతినిత్యం ఉదయం వేళల్లో డ్రైనేజీ నుంచి మురుగునీరు రోడ్డుపై పారుతుంది. దీంతో ప్రజలు రోడ్డుపై నడవాలంటే మురుగునీటిలోంచి నడవాల్సి వస్తుంది. దుర్వాసన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తరచూ పొంగిపొర్లుతున్న డ్రైనేజీకి శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రీసైక్లింగ్‌ యూనిట్‌ల వల్లనే..

కాలనీలో ఇళ్ల మధ్యలో చాలా వరకు రీసైక్లింగ్‌ పరిశ్రమలు ఉన్నాయి. అధికారులు కాలనీలో ఉన్న అన్ని రీసైక్లింగ్‌ పరిశ్రమలకు డ్రైనేజీ కనెక్షన్‌ ఇచ్చారు. దీంతో సదరు పరిశ్రమ నిర్వాహకులు చెత్తాచెదారాలను తరచూ నాలాల్లోకి పారవేస్తున్నారని, అందుకే తరచూ నాలాలో చెత్తాచెదారాలు తట్టి డ్రైనేజీ అవుట్‌లెట్‌ మూసుకుపోతుందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూజీడీలోకి చెత్తాచెదారాలు చేరకుండా చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీలు పొంగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి

కుత్బుల్లాపూర్‌: నియోజకవర్గ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్‌ అన్నారు. బుధవారం గాజులరామారం డివిజన్‌ మహదేవపురంలోని కమలమ్మ కాలనీలో ఆయన పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. గతంలో కాలనీ వాసులు సీసీ రోడ్డు కోసం శ్రీశైలంగౌడ్‌ను కలిసి విన్నవించగా.. రూ.60 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో కాలనీ వాసులు ఆయనను సన్మానించారు. అనంతరం శ్రీశైలంగౌడ్‌ మాట్లాడుతూ.. ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యాదవరావు, రమణారెడ్డి, శ్రీనివాసరావు, రామచంద్రారెడ్డి, ప్రవీణ్‌, ప్రభాకర్‌ రెడ్డి, దేవేందర్‌ రెడ్డి, మహేశ్వర్‌ రెడ్డి, నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్‌ను సన్మానిస్తున్న కాలనీ వాసులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కుత్బుల్లాపూర్‌: కాంగ్రెస్‌ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతోందని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంతరెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్‌ బాపునగర్‌లో రూ.24.5 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా బాపునగర్‌ వాసులు రోడ్డు సదుపాయం లేక ఇబ్బందులు పడుతున్నారని, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లగా.. ఆయన రూ.24.5 లక్షల స్పెషల్‌ నిధులను మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో పెంటయ్య, గడ్డం రాజేందర్‌రెడ్డి, సిద్దయ్య, ఆగమయ్య, జెస్సి, ఈశ్వర్‌, వీరేష్‌, మల్లికార్జున్‌ రావు, బాపునగర్‌ కాలనీ అధ్యక్షులు జగదీష్‌ గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న కొలన్‌ హన్మంతరెడ్డి తదితరులు

జర్నలిస్టుల పక్షాన టీడబ్ల్యూజేఎఫ్‌ పోరాటం



సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య తదితరులు

సుభాష్‌నగర్‌: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి టీడబ్ల్యూజేఎఫ్‌ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బసవపున్నయ్య అన్నారు. బుధవారం గాజులరామారం సర్కిల్‌ పరిధి నల్లగుట్ట నరసింహస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సంఘం సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఫెడరేషన్‌ కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ అధ్యక్షుడు గడ్డమీది అశోక్‌ అధ్యక్షత వహించారు. జర్నలిస్టులు సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కదలాలన్నారు. కార్యక్రమంలో ఫెడరేషన్‌ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌.కె సలీమా, తన్నీరు శ్రీనివాస్‌, రాష్ట్ర నాయకులు గుమ్మడి హరి ప్రసాద్‌, రోజారాణి, నియోజకవర్గ కార్యదర్శి శంకర్‌, గోవిందరావు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పాఠ్యాంశాల్లో చేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్‌: భారత రాజ్యాంగాన్ని నేటి యువత ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని జై భీమ్‌ మహాసేన మానవ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు అశోక్‌, ప్రధాన కార్యదర్శి మంచింటి అంజన్న అన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ప్రత్యేక పాఠ్యాంశాలు చేర్చాలని కొన్ని సంవత్సరాలుగా చేస్తున్న పోరాటంలో భాగంగా బుధవారం ఆ సంఘం ఆధ్వర్యంలో ఎస్సీ ఎస్టీ కమిషన్‌ రాష్ట్ర చైర్మన్‌ బక్కి వెంకటయ్య, రాష్ట్ర విద్యా కమిషన్‌ చైర్మన్‌ ఆకునూరు మురళిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పాఠ్యాంశాలలో చేర్చే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో దాసరి రవీందర్‌, అమర్‌ బాబు, రవితేజ, జేమ్స్‌, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫైర్‌ సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన

రంగారెడ్డినగర్‌: అగ్ని ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగి ఉండాలని జీడిమెట్ల ఫైర్‌స్టేషన్‌ ఆఫీసర్‌ శేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం రంగారెడ్డినగర్‌ డివిజన్‌ నందానగర్‌లోని కృష్ణవేణి టాలెంట్‌ స్కూల్‌లో ఫైర్‌సేఫ్టీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నపాటి అగ్ని ప్రమాదమైనా అప్రమత్తంగా ఉండాలని, వెంటనే నీటిని చల్లడం, మంటలపై ఇసుక చల్లడం వంటివి చేయాలన్నారు. ఎవరైనా ప్రమాదం బారిన పడితే వెంటనే వారికి బట్టలు చుట్టి మంటలను ఆర్పాలన్నారు. పెద్ద ప్రమాదం జరిగితే ఫైర్‌స్టేషన్‌ సిబ్బందికి సమాచారం అందిస్తే వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతారన్నారు. కార్యక్రమంలో ఫైర్‌స్టేషన్‌ సిబ్బంది, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్‌, కార్పొరేటర్‌ రావుల శేషగిరి

– ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కెపి వివేకానంద్‌ అన్నారు. గాజులరామారం డివిజన్‌ సుభాష్‌ చంద్రబోస్‌ నగర్‌లో రూ. 11 లక్షలు, కైసర్‌నగర్‌లో రూ.22 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులను కల్పించేందుకు గత పది సంవత్సరాల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ రావుల శేషగిరి, డివిజన్‌ అధ్యక్షుడు విజయ్‌ రాం రెడ్డి, సీనియర్‌ నాయకులు కస్తూరి బాల్‌రాజ్‌, అడ్వకేట్‌ కమలాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

కుత్బుల్లాపూర్‌: జీడిమెట్ల డివిజన్‌ గోదావరి హోమ్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయ చతుర్థశ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 6గంటలకు స్వామి వారికి పెద్దశేషవాహన సేవ నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఆలయ ప్రాంగణంలో కూచిపూడి నృత్య ప్రదర్శ ఏర్పాటు చేశారు. గురువారం మధ్యాహ్నం 12 గంటలకు శ్రీదేవి భూదేవి సహిత శ్రీవారి కల్యాణ మహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది.

ఇంటర్‌ పరీక్షలు ప్రారంభం

సుభాష్‌నగర్‌: కుత్బుల్లాపూర్‌లోని పలు సెంటర్లలో ఇంటర్‌ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు తరలివచ్చారు. ఉదయం 8:30 నుంచి 9.05 నిమిషాల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. ప్రతి విద్యార్థిని పరిశీలించి సెంటర్‌లోకి పంపారు. కొంతమంది విద్యార్థులు చివరి నిమిషాల్లో వచ్చి ఉరుకులు.. పరుగులు పెట్టారు. మొదటి రోజు పరీక్షలు శాంతియుతంగా జరిగాయి.





హాల్‌ టికెట్లను పరిశీలిస్తున్న అధికారి



పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు

కాంగ్రెస్‌ పార్టీలో చేరిక



నిజాంపేట్‌ : సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బుధవారం కార్పొరేషన్‌ డివిజన్‌ 1లోని వివిధ కాలనీల ప్రజలు బుధవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంతరెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలోరాజిరెడ్డి, శరగడం నర్సింగరావు, గంజి ప్రభాకర్‌రావు, ఎ.నవీన్‌ కుమార్‌, కృష్ణ చైతన్య, నరేష్‌, జైపాల్‌ రెడ్డి, కోటేశ్వర్‌రావు, వెంకటేషం పాల్గొన్నారు.

స్థిరమైన భూ నిర్వహణ పద్ధతులపై శిక్షణ

సుభాష్‌నగర్‌: వాతావరణ స్థితి స్థాపకత కోసం స్థిరమైన భూనిర్వహణ పద్ధతులపై బహదూర్‌పల్లిలోని అటవీ జీవ వైవిధ్య సంస్థలో పాక్షిక–శుష్క ఉష్ణ మండలంలో ఐసీఏఆర్‌ పాడి భూముల వ్యవసాయ కేంద్రం సంస్థతో కలిసి బుధవారం ప్రాంతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. 3 రోజులపాటు జరుగనున్న ఈ కార్యక్రమానికి మొదటి రోజు ఐఎఫ్‌ఎస్సీ డైరెక్టర్‌ డెహ్రాడూన్‌ వినయ్‌ కుమార్‌ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐఎఫ్‌ఎస్సీ డైరెక్టర్‌ వెంకట్‌ రెడ్డి, ఐఎఫ్‌బీ డైరెక్టర్‌ ఎస్‌.కె బాల్‌ పాల్గొన్నారు.

